# గంగో గర్భశోకం

*గంగో ఉద్యోగం ఊడినప్పుడు వర్షాకాలపు తొలకరి జల్లులు ప్రారంభమయ్యాయి.*

*గడచిన మూడు దినాల నుండి ఆకాశం మేఘావృతమై వుంది. వాటి నీడలో వేసవి తాపానికి అలసిపోయిన భూమి చల్లగా శ్వాస తీసుకుంటూ వుంది. నగరంలోని పెద్దలు, పిల్లలు నగ్నంగా వాటిని స్వాగతించడానికి ఉత్సాహపడుతున్నారు.*

*వాస్తవంగా ఈ దినం ఉద్యోగం నుంచి తొలగించవలసిందిగాదు. ఉద్యోగం ఊడక పోతే పాపం గంగో గూడ అందరిలా తొలకరి చినుకుల ఆనందం అనుభవించి వుండేది. కానీ గంగో మేఘాల ప్రథమ గర్జనతోనే తన భాగ్యరేఖ వక్రించినట్లు పసికట్టింది.*

**హిందీ మూలం: భీష్మ సాహనీ**

**తెలుగు సేత: కొమ్మా శివశంకరరెడ్డి**

ఉద్యోగం చేజారడంలో జాప్యం జరుగలేదు. గంగో పనిచేసే భవంతిలో కింది అంతస్తు పూర్తికాగా రెండవ అంతస్తులో పని జరుగుతూ వుంది. కింది నుంచి గార నింపిన గంపలు పై అంతస్తుకు చేర్చడం గంగో పని. కానీ ఈ దినం ఉదయం గంప ఎత్తుకోటానికి వంగినపుడు ఆమె చేతులు భూమిని తాకలేదు. కాళ్ల దగ్గరున్న గంపను తాకటం లోతు బావి నుండి నీటిని తోడినంత దుర్భరమైంది.

ఇంతలో ఎవరో పిలిచారు "గంగో నామాట విను. ఇక వంగి గంప ఎత్తడం నీవల్లగాదు. నీవిటురా, ఇటుకలు పట్టుకొనే పని సులభం" పై అంతస్తులో ఎర్ర ఓణీ ధరించిన దూలో ఆమెను పిలుస్తూ వుంది.

గంగో వినిపించుకోక మరో మారు గంప ఎత్తటానికి సాహసించింది. కానీ పాపం గంప వరకు చేతులు చేరితేగదా! గంగోకు కొడుకు పుట్టబోతాడు, అనతికాలంలోనే. పై అంతస్తు నుండి ఇటుకలు పట్టుకోవడం గూడ సులభంగాదు. ఒక కూలీ కింది నుంచి ఒక్కొక్క ఇటుక పైకెగరేస్తే పైనున్న ఆడకూలీ వాటిని లాఘంగా పట్టుకుంటుంది. కానీ ఈపనంటే భయంతో రక్తం గడ్డ కట్టుకుపోతుంది గంగోకు. ఒకవేళ ఇటుక చేజారి కడుపు మీద పడితే ఏంగాను?

ప్రతి కూలీకి భాగ్యవిధాత కంట్రాక్టరే. అతని దయాదాక్షిణ్యాలుంటే కూలీల ఆశలు నెరవేరినట్లే. ఆ విధాత కనుబొమలు చిట్లిస్తే జరుగరానిదే జరిగిపోతుంది. గంగో ఘడియలు లెక్కిస్తుండగానే కంట్రాక్టరు రానేవచ్చాడు. తెగ బలిసిన శరీరం, నల్లటి క్యాపు, దట్టమైన మీసాల మధ్య గుప్పు గుప్పున బీడీ పొగ. గంగోను చూడగానే గర్జించాడు.

"నిలబడి ఏంచేస్తున్నావు? ఎత్తు గంప కడుపు కదపలేని నీవు కూలికెందుకొచ్చినట్టు?"

గంగో మెల్లమెల్లగా తడబడుతూ కంట్రాక్టరు వద్దకొచ్చి నిలుచుంది. "పనెందుకు చెయ్యను సామీ? నీ బాంచను. పైన ఇటుకలు పట్టే పనివ్వండి. సేత్తాను"

గంగో దీనంగా వేడుకుంది. "నీకు నచ్చిన పని చేయడానికిదేమైనా నీ బాబుగారిల్లా? వెళ్లువెళ్లు అర్ధరోజు కూలి తీసుకొని దయచెయ్. దండగ ముండలు" కంట్రాక్టరు కసిరాడు.


"మీకేమీ నట్టంలేదు దొరా. దూలో నాపని సేత్తాది, నేనామె పనిజేత్తాను. పని జరుగుద్ది"

"ముందు కడుపు ఖాళీ చేసుకురా. తరువాతనే పని."

క్షణాల మీద రిజిస్టరు రావడం, గంగో పేరు మీద వంకర గీత కెలకడం పూర్తయింది.

అదే సమయంలో వర్షపు చినుకులు రాలడం ప్రారంభమైంది. ఆకాశంలో మేఘాలలుముకుంటే చాలు కంట్రాక్టరుకు పని ముగించటానికి సాకు దొరికినట్లే. ఇలాంటి గడ్డు కాలంలో కడుపొచ్చిన కూలీని పనిలో ఎవరుంచుకుంటారు? ఆశలుడిగిన గంగో పైట చెరగుతో గర్భం దాచుకొని బయట కెళ్లింది.

ఢిల్లీ మరల పునర్మితమైనట్లుగా వుంది. కొత్తకొత్త భవన సముదాయాలు అసంఖ్యాకంగా ఆఘమేఘాల మీద గగనవీధుల కెగసిపోతున్నాయి. వినూత్న భవన సముదాయాలు సముద్రపుటలల వలె విస్తరిస్తూ ఢిల్లీలోని పురాతన అవశేషాలనూ, స్మృతులనూ నేలమట్టం చేస్తున్నాయి. చూస్తూ వుండగానే పెద్దపెద్ద బస్తీలు సగర్వంగా తలలు పైకెత్తి కాలగమనాన్ని పరిహసిస్తున్నాయి. ఢిల్లీకి మరల యవ్వన మొచ్చినట్లు ప్రజలకు ఆశ్చర్యం, ఆనందం. కొత్త సముదాయాలు వరదలా వ్యాపిస్తున్నాయి, కొత్త నగరమూ, కొత్త నిర్మాణాలూ శర వేగంతో విస్తరిస్తున్న దేశ రాజధాని నగరం ఢిల్లీ.



ఏదైన కొత్త బస్తీ నారంభించడమే తడవు, వందల కొలది కూలీలు భుజాలపై తమ బోద గుడిశలెత్తుకొని గుంపులు, గుంపులుగా రావటం, దాని సరసనే గుడిశల గూడెం తయారుచేయటం జరిగిపోతుంది. ఆ బస్తీ నిర్మాణం పూర్తికాగానే మరొక బస్తీ పునాదులు నిర్మించటానికి కూలీల గుంపులు ప్రస్థానం చేయడం జరుగుతూ వుంటుంది. కానీ వర్షాకాలం ప్రారంభం కాగానే వారికి గడ్డు దినాలు మొదలవుతాయి. చిరుజల్లులు పడగానే పనులు ఠక్కున ఆగిపోవడం, వర్షాకాలపు నాల్గుమాసాలు ఆకలితో అలమటిస్తూ జీవన పోరాటం సాగించడం పేద కూలీలకు అనివార్యం. కొందరు తమ గ్రామాలకు తిరుగుముఖం పట్టడం, కొందరు పొట్ట చేత బట్టుకొని నగరంలోనే ఒకటీ, అరా పనుల కొరకు వెదకడం ఒక నిష్ఠుర సత్యం. కూలీలకు చేతినిండా పనీ, కడుపునిండా కూడూ లభించడం దుర్లభం. ఢిల్లీలోని ప్రతి శిథిలానికి ఒక చరిత్ర వుంటుంది. కానీ కూలీల గుడిశలకే ఏ చరిత్ర వుండదు. కళకళలాడే భవనాల మధ్య చితికిపోయిన స్మృతి చిహ్నాలైనా మిగలవు. ఏం మాయాజాలమో, అంతు తెలియని విష వలయం.

ఆనాటి రాత్రి గంగో, ఆమె భర్త ఘీసూ గుడిశ వెలుపలే తమ దుస్థితిని గురించి చింతిస్తూ కూర్చున్నారు.

"పని వూడ బెరికిన తర్వాత ఇంటికెందుకొచ్చినట్లు? మరొకచోట పని వెదకలేకపోయావా?" ఘీసూ రెట్టించాడు.

"చూస్తున్నావుగా ఈ దశలో పనెవరిస్తారు? వెళ్లిన ప్రతిచోట కడుపు చూచి కసురుకుంటారు."

గుడిశ లోపల వారి ఆరు సంవత్సరాల పిల్లాడు రీసా నిద్రిస్తున్నాడు. ముగ్గురు తినేవారు, సంపాదించే వాడు కేవలం ఒకడు. నాలుగుమాసాల వర్షాకాలం. పైపెచ్చు గంగో గర్భవతి. ఈ ఆలోచనరాగానే ఘీసూ మనసు వికలమైంది. ఇంకా పదిహేను దినాలైనా ఇలానే గడచిపోయి వుంటే కొంత బావుండేది. గర్భవతులు గూడ ప్రసవ దినం వరకు పనిలోనే వుంటారు. ఘీసూ పొట్టిగా, గట్టిగా వుండేవాడు. ఏ కారణం చేతనైనా కోపపడితే గంటల తరబడి సణుగుతూ వుండటం అతని స్వభావం. కాసేపు చిలుం దమ్ములు లాగి "నీవు మీ ఊరికి వెళ్లిపో" అన్నాడు.

"ఊర్లో నాకెవరున్నారు?"

"నీవు ముందే పాఠాలు అప్పజెప్తున్నావే! ఈ స్థితిలో నిన్నెవరైనా బయటికి తోసేస్తారా?"

"నేనెక్కడకూ ఎల్లను. మీ తమ్ముడు నన్ను ఇంటిలో అడుగుపెట్టనివ్వడు. మీ ఇద్దరి మధ్య రెండుసార్లు కొట్టుకు చచ్చేంత వ్యవహారం జరిగింది."

"ఇక్కడుండేం వరగబెడతావు? నా పనికే ఠికానా లేదు. సరకారోళ్లు ఎక్కువ మంది కూలీలను బెట్టి మూడు దినాల్లో పని ముగించాలనుకున్నారట."

"మరమ్మతు పనులు జరుగుతూనే వుంటాయి



ఘీసూ, రీసాను గణేశీకి అప్పగించొచ్చాడు. పాలిశ్ డబ్బాకూ, బ్రష్‌కూ డబ్బులు గూడ ఇచ్చాడు. మొదటిరోజు గదా. రీసా తాను గాలిలో గంతులేస్తున్నట్లు సంబరపడ్డాడు. కొత్తకొత్త వీధులూ, ఆకాశహర్మ్యాలూ చూచే అదృష్టం లభించింది. అడుగడుగునా ఆకర్షణ. రంగు రంగుల వస్తువులతో మురిపిస్తున్న దుకాణాలు. ఊహించనంత జన సందోహం.

గదా" గంగో మెల్లగా అంది.

"మరమ్మతు పనులతో మూడు పానాలు బతకచ్చా? ఒక దినం పనుంటే నాలుగు దినాలుండదు" రాత్రి పొద్దుపోయేవరకు ఈ సమస్యే నలుగుతూ వుండింది.

సోమవారం నుంచి గంగోకు ఉద్వాసన జరిగింది. శనివారం వచ్చేటప్పటికి ఇల్లు గడవడం గగనమైపోయింది. తల్లీ, తండ్రీ, కుమారుడూ ముగ్గురు తినేవారైతే సంపాదించేది ఒకడు. గంగో ఏదైనా పని దొరుకుతుందనే ఆశతో ఉదయమే బయలుదేరడం, మధ్యాహ్నం వరకు బస్తీలలో చక్కర్లుకొట్టి రావడం తప్ప పనిమాత్రం శూన్యం. రోడ్లపైన డజన్లకొద్దీ పనిలేని కూలీలు తచ్చాడుతూ కనిపిస్తారు. గోరుచుట్టుపై రోకటి పోటులా ఒక దినం ఘీసూ వచ్చి సరకారోళ్ల పనిగూడ పూర్తయినట్లు చావుకబురు వినిపించాడు. ఘీసూ, గంగో కూలీల స్థాయి నుంచి తిరుగుబోతుల స్థాయికి పడిపోయారు. ఒక దినం పొయ్యి మండితే ఒక దినం లేదు. అర్ధ కడుపు నిండడమే అబ్బురమైపోయింది. రోజంతా నిశ్చింతగా ఆడుకొనే రీసా ఆటలు మాని గుడిశ చుట్టూ ప్రదక్షిణలు మొదలెట్టాడు. భార్యాభర్తలిద్దరూ ప్రతి రాత్రి తిట్టుకోవడం సాధారణమైపోయింది.

ఒకనాటి రాత్రి వున్నట్టుండి ఘీసూకొక ఉపాయం తట్టింది. కాలిన కడుపును చిలుం పొగతో చల్లబరుస్తూ అన్నాడు- "రీసాను ఏదైనా పనిలో పెట్టేస్తే?"

"రీసా ఏంచేస్తాడు? పాపం పసిపిల్లాడు."

"పసిపిల్లాడా? బాగా మనిషన్నం తింటాడు. ఇలాంటి పిల్లలు కొల్లలుగా పనిచేస్తున్నారు."

గంగో మారు మాట్లాడలేదు. సంపాదించే కుర్రోడెవరికి నచ్చడు. కానీ అమాయకుడైన రీసాకేపనీ తెలియదు. కానీ ఘీసూ "ఇలాంటి బుడుతలు బూట్ పాలిశ్ చేస్తున్నారు, సైకిల్ షాపుల్లో పనిచేసి సంపాదిస్తున్నారు, వార్తాపత్రిక లమ్ముతున్నారు, ఏంచేయడంలేదని" గదమాయించాడు. "రేపు నేను వీన్ని గణేశీకి అప్పగిస్తాను. బూట్‌పాలిశ్ చేయడం నేర్పిస్తాడు" అన్నాడు.

గణేశీ గూడ ఘీసూ గ్రామస్తుడే. ఒక చిన్న గదిలో వుంటూ పాలిశ్ పెట్టె భుజాన వేసుకొని గల్లీలలో కాళ్లరిగేలా తిరుగుతూ బూట్ పాలిశ్ చేసేవాడు. పనిచేయమని చెప్పడం సులభమే. కానీ రీసాను పనిలో పెట్టడం కొత్త ఎద్దుతో నాగలి దున్నినట్లే. ఘీసూ, రీసాను గణేశీకి అప్పగించొచ్చాడు. పాలిశ్ డబ్బాకూ, బ్రష్‌కూ డబ్బులు గూడ ఇచ్చాడు. మొదటిరోజు గదా.

రీసా తాను గాలిలో గంతులేస్తున్నట్లు సంబరపడ్డాడు. కొత్తకొత్త వీధులూ, ఆకాశహర్మ్యాలూ చూచే అదృష్టం లభించింది. అడుగడుగునా ఆకర్షణ. రంగు రంగుల వస్తువులతో మురిపిస్తున్న దుకాణాలు. ఊహించనంత జన సందోహం. "నాన్న ఎందుకు చిరాకు పడుతుంటాడో" రీసా కంతు చిక్కని ఆశ్చర్యం.

తల్లి గంగో తల్లడిల్లుతూ మధ్యాహ్నం రీసా కొరకు దారికాస్తూ నిల్చుంది. రీసా బరువైన పాదాలు ఈడ్చుకుంటూ మొదటి దినం పని లేకనే ఇల్లు చేరాడు. తన ఆరేళ్ల జీవితంలో ఏనాడూ ఇంత దూరం నడవలేదు. తల్లి సరసన చేరగానే తన అనుభవ సారాన్నంత విడమర్చాడు. నాన్నను చూడగానే "నాన్నా నీ జోళ్లు పాలిశ్ చేయనా?" అంటూ పరుగుదీశాడు. ఆ మాట విని ఎప్పుడూ కోపంతో చిటపటలాడే ఫీసూ ముఖంలో చిరునవ్వు చిందులేసింది.

"నావిగాదు ఏ బాబుగారి జోళ్లైనా పాలిశ్ చెయ్."

గంగో, ఆమె భర్త, కుమారుని దినచర్య విని లిప్తకాలం తమ చింతలను మరచిపోయారు. రెండవ దినం ఫీసూ, రీసా తమతమ పనులపై బయలుదేరారు. ఫీసూ రెండు రొట్టెలు, రీసా ఒక రొట్టె పాత గుడ్డలలో చుట్టి తమ సంకలో సర్దుకున్నారు. ఇద్దరూ తమతమ దిశలలో వేరు వేరుగా వెళ్లారు. రీసా గణేశీ ఇంటికెళ్లి చూడగా అతడు లేడు.

కాసేపు నోట్లో వేలేసుకొని వంతెనపై వచ్చేపోయే వాళ్లను అమాయకంగా చూస్తూ నిల్చున్నాడు రీసా. తరువాత గణేశీని వెదుకుతూ కదిలాడు. ఒకటి తరువాత మరొకటి నగరంలోని వీధులు పద్మవ్యూహంలా రీసా కొరకే ఎదురు చూస్తున్నట్లున్నాయి. ఒకటొకటిగా వీధులు దాటుతూ వెళుతున్నాడు. కానీ నిన్న చూచిన వీధులు ఈవాళ కనుపించట్లేదు. ఎక్కడ గణేశీ జాడలేదు. హతాశుడై తుదకొగ వీధిమలుపులో కూర్చున్నాడు. పాలిశ్‌డబ్బా, బ్రష్ ఎదుట వుంచుకొని మూతి వంకరజేసి పాలిశ్... శ్... శ్ అని శక్తికొలది అరవడం ప్రారంభించాడు. మొదట తన శబ్దం విని తానే ఉలికిపడ్డాడు. తరువాత నిర్భయంగా అరవడం మొదలెట్టాడు. చాలాసార్లు అరచిన పిదప ఒక బాబు ఎదుటి కొట్టులో వెచ్చాలు కొంటూ వుండి రీసా దగ్గరకొచ్చాడు.

"పాలిశ్ చేసినందుకేం తీసుకుంటావు?"

"మీకు తోచినంత ఇవ్వండి సారూ"

బాబుగారు బూటు వదలి కొట్టు దగ్గరకెళ్లాడు.

రీసా డబ్బా తెరచాడేగానీ పాలిశ్ చేయడం చేతకాలేదు. నేర్పుగా పాలిశ్ చేయడం తెలియదు. పాలిశ్ చేతులకు, కాళ్లకు, ముఖానికి పూసుకున్నాడు. ఒక బూటుకు పాలిశ్ చేసే లోపల సగం డబ్బా పాలిశ్ ఖర్చు చేశాడు. బూటు కిందగూడ పాలిశ్ చేస్తున్నాడు. ఇంతలో బాబుగారొచ్చారు. బూటుకు పట్టిన దుర్గతి చూచి బాబు కోపంతో వెనకా ముందూ చూడకుండా ఛెల్లున రీసా చెంప వాయించాడు. రీసా తల తిరిగిపోయింది. కారణం తెలియని రీసా భయంతో కంపించిపోయాడు.

"దరిద్రపు వెధవా నల్లని బూటుపై ఎర్ర పాలిశ్ వేస్తావట్రా?" ఆవేశంతో తిట్ల దండకం ప్రారంభించాడు.

గంగో మూరెడెత్తులో నున్న గుడిశ కప్పును చూస్తూ నిశ్శబ్దంగా పడుకుంది. అదే సమయంలో నవాంగతకుడు ప్రపంచ ప్రవేశం చేయటానికి తలుపు తడుతున్నాడా అన్నట్లుగా గంగో గర్భంలో పిల్లవాడు కదలికలు ప్రారంభించాడు. "ఈ నరకంలో ప్రవేశించటానికి వీడెందుకింత ఆరాటపడుతున్నాడ"ని గంగో మనసు ఆక్రోసించింది. అయినా ఆమె ఒకవైపు కడుపులో కదిలే బిడ్డను నిమురుతూ, మరొకవైపు ఏకధారగా కారే కన్నీరు చిరిగిన చెరగుతో తుడుచుకుంటూ వుంది.



దగ్గర నిలుచున్నవారు ఈ అభినయం చూచి నవ్వుకున్నారు. కొందరేమో బాబును శాంతపరచారు. కొందరు రీసాను తిట్టారు. బాబు బూట్లేసుకొని వెళ్లాడు. రీసా భయభ్రాంతుడై మార్చి మార్చి అందరి ముఖాలు చూస్తూ వుండిపోయాడు. మెల్లగా లేచి వీధి రెండవ కొసకెళ్లి నిలబడ్డాడు. పాలిశ్...శ్...శ్ అని అరిచే సాహసం గూడ చేయలేకపోయాడు. రీసాకు తల్లి జ్ఞాపకం వచ్చి వెనుదిరిగాడు. కానీ వీధులకు ఆది అంతంలేదు. ఒక వీధి కొసకు చేరితే నాలుగు వీధులు దర్శనమిస్తున్నాయి. కాళ్లరిగే వరకు లెక్కలేనన్ని వీధులు తిరిగి తిరిగి చివరకు భయపడి ఏడ్వడం ప్రారంభించాడు. కానీ ఆ జనారణ్యంలో వాని కన్నీరు తుడిచే వారెవ్వరు? అయినా వీధివీధి దాటుతూ అమ్మను స్మరించుకుంటూ మధ్యాహ్నం వరకు తిరుగుతూనే వున్నాడు. మాటిమాటికి ఏడ్వడం భయంతో నోరు మూసుకోవడం ఇలానే సంజె వేళయింది. చీకటి పడసాగింది. దిక్కుతోచక వెక్కివెక్కి ఏడ్వసాగేడు. ఇంతలో రీసా వంటి చిన్నపిల్లల గుంపొకటి వీధులు సర్వే చేస్తున్నట్లు అక్కడ కొచ్చింది. వారిలో ఒక చిన్నపిల్లవాడు తన చిరిగిపోయిన టోపీ సర్దుకుంటూ "అరే సాలే ఎందుకునా ఏడుస్తున్నావు?" అన్నాడు.

రెండవవాడు రీసా చెయ్యి బట్టుకొని ఒక వరండా కిందికి లాక్కెళ్లాడు. మూడవ వాడొక తోపు తోశాడు, నాల్గవ వాడు భుజం మీద చేయివేసి వరండాలో ఒక మూల కూర్చుండబెట్టాడు. తరువాత చిన్నపిల్లవాడు తన చొక్కా జేబు నుంచి కొన్ని వేరుశెనగ కాయలు తీసి రీసా బ్యాగులో వేశాడు.

"తినరా సాలే ఎవరైనా ఏడుస్తారటరా. మాతో తిరుగుతూ వుండు. మేం గూడ బూట్‌పాలిశ్ చేసేవాళ్లమే."

అర్ధరాత్రి దాటింది. పసివాడైన రీసా, జీవితంలో పూర్తి మజిలీ ఒకే దినం లంఘించి, తల కింద పాలిశ్ డబ్బా, బ్రష్షు పెట్టుకొని అదే వరండా కింద నిద్రాదేవత ఒడిలో వొదిగి సేద దీర్చుకున్నాడు.

అక్కడ గుడిశలో, ఎన్నో గంటలు రీసా కొరకు ఫలించని అన్వేషణానంతరం ఫీసూ, గంగోను ఓదారుస్తున్నాడు. "నాకెవరు పని నేర్పారు? అందరూ వీధుల్లోనే నేర్చుకుంటారు. వాడు ఫీసూ కొడుకు. ఎన్నటికీ చావడు. ఈనాడు గాకుంటే ఏనాడైనా నిన్ను తప్పక కలుస్తాడు."

ఉద్విగ్న మనస్కుడైన ఫీసూ ఒకవైపు కుమారుని కొరకు బాధపడుతూనే మరోవైపు "నేడు మొదలు గుడిశలో ఇరువురమే వుంటామనీ, వర్షాకాలం గడచేవరకూ, గంగో గర్భం నుండి కొత్త ప్రాణి వచ్చేవరకూ జీవన యానం నిరాటంకంగా సాగిపోతుందనీ" ఒక దారుణమైన సత్యాన్ని నెమరువేసుకుంటున్నాడు.

గంగో మూరెడెత్తులో నున్న గుడిశ కప్పును చూస్తూ నిశ్శబ్దంగా పడుకుంది. అదే సమయంలో నవాంగతకుడు ప్రపంచ ప్రవేశం చేయటానికి తలుపు తడుతున్నాడా అన్నట్లుగా గంగో గర్భంలో పిల్లవాడు కదలికలు ప్రారంభించాడు. "ఈ నరకంలో ప్రవేశించటానికి వీడెందుకింత ఆరాటపడుతున్నాడ"ని గంగో మనసు ఆక్రోసించింది. అయినా ఆమె ఒకవైపు కడుపులో కదిలే బిడ్డను నిమురుతూ, మరొకవైపు ఏకధారగా కారే కన్నీరు చిరిగిన చెరగుతో తుడుచుకుంటూ వుంది.

ఆకాశంలో శ్రావణమేఘాల మధ్య తొంగి చూచే చంద్రకాంతిలో మిలమిల మెరిసే భవన సముదాయాలు సగర్వంగా తలలాడిస్తున్నాయి. ఢిల్లీ మళ్లీ కొత్త ఢిల్లీగా విస్తరిస్తూ మూడు పువ్వులు ఆరుకాయలుగా పరిఢవిల్లుతూ వైభవం సంతరించుకుంటూ వుంది, చరిత్రను తిరగరాస్తున్నట్లు. ●